సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: టెన్త్ విద్యార్థులు ఒత్తిడిని వీడి పరీక్షలు రాయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. ఊర్వశి కూడలి గౌరీనగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించే దిశగా నడుచుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల్లో 10/10 మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి ప్రోత్సాహకాలు అందిస్తానని తెలిపారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సతీష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా ఎర్నికుమార్ యాదవ్, నమ్మి జ్యోతేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు సంతృప్తికరం



గోపాలపట్నంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవానందరెడ్డి, డీఈవో ప్రేమ్‌కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలను పదో తరగతి పరీక్షల నిర్వహణాధికారి దేవానంద రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ ఆదివారం సందర్శించారు. కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. చిన్నచిన్న లోపాలను సైతం సరి చేశామన్నారు. వారివెంట డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఎస్. మురళి, గోపాలపట్నం హెచ్‌ఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

వాకింగ్ పార్కుకు హంగులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని వాకింగ్ పార్కులో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.సుమారు రూ.14 లక్షలతో చేపట్టిన పనుల్లో భాగంగా పార్కు ముఖ ద్వారాన్ని కొత్తగా నిర్మిస్తున్నారు.దీంతో పార్కుకు కళ వచ్చింది.అలాగే పార్కులో మరుగుదొడ్లు, రక్షణ గోడ ఎత్తు పెంచే పనులు చేపట్టి,రంగులు వేస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: రంజాన్ సందర్భంగా 61వ వార్డు ప్రకాష్‌నగర్ మసీద్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రభుత్వవిప్ పి.గణబాబు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ విందును స్వీకరించారు. మతసామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

స్మార్ట్ షాక్!





వారంతా చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తున్నారు. నేడు ఆ కాస్త ఉపాధికి కూడా గండం ఏర్పడనుందని తెలుసుకుని మనస్తాపానికి గురవుతున్నారు. ఇంత కాలం ఉద్యోగ భద్రత కోసం ఆలోచించిన వారు.. ఇప్పుడు తమ పొట్టకొట్టవద్దు అనే పరిస్థితికి చేరారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు తమ జీవనానికి గండి కొట్టుబోతున్నాయని రీడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- స్మార్ట్ విద్యుత్ మీటర్లతో రీడింగ్‌కు చెక్
- రోడ్డున పడనున్న రీడింగ్ కార్మికులు
- తమకు భరోసా కల్పించాలని డిమాండ్



వినియోగదారుడి బిల్లు ఇస్తున్న కార్మికుడు



స్మార్టు మీటర్



మీటర్ రీడింగ్ తీస్తున్న కార్మికుడు

మల్కాపురం: రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ వినియోగదారునికి స్మార్టు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని సర్కార్ ఆదేశాలను జారీ చేసింది. దీనిలో భాగంగా ఇళ్లు, కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల వద్ద ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు.దీంతో మీటర్ రీడర్లలో ఆందోళన మొదలైంది. తమ ఉపాధికి గండిపడుతుందని కలవరపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంత పరిధిలో మల్కాపురం,శ్రీహరిపురంలో రెండు విద్యుత్ ఉప కేంద్రాలు (సబ్‌స్టేషన్లు) ఉన్నాయి. మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 23 వేల మంది గృహ వినియోగదారులు ఉంటే, సుమారు 1400 మంది వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. అలాగే శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో 25 వేల మంది గృహ సముదాయాలు ,సుమారు 5 వేల వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో పని చేస్తున్న సుమారు 14 మంది మీటర్ రీడింగ్ తీసే కార్మికులు వారికి కేటాయించిన నివాసాలు, వాణిజ్య సముదాయాల వద్దకు వెళ్లి మీటర్ రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులు ఇస్తుంటారు.



మల్కాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న రీడర్లు

మూడు దశాబ్దాలుగా సేవలు

కొంత మంది రీడర్లు సుమారు 30 ఏళ్ల నుంచి పని చేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ. 13 నుంచి రూ.15 వేల వరకు జీతం వస్తుంది. అయితే ప్రస్తుతం స్కానింగ్ మీటర్ల స్థానంలో స్మార్టు మీటర్లు వస్తున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తే రీడింగ్ తీసే కార్మికులకు ఉపాధి ఉండదు. ఎందుకంటే స్మార్టు మీటర్‌లో ఉండే చిప్ ఆధారంగా గృహ లేదా వాణిజ్య విద్యుత్ వినియోగదారులు వారి వ్యక్తి గత సెల్ ఫోన్లకు వాట్సాప్ ద్వారా ప్రతి నెలా ఇంత విద్యుత్ బిల్లు చెల్లించాలి అని సందేశం వస్తుంది. దీంతో వారు ఫోన్ పే లేదా ఏపీఈపీడీసీఎల్ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించుకుంటారు. దీంతో రీడింగ్ తీసే పని లేక వారి ఉపాధికి గండి ఏర్పడుతుంది. దీంతో కార్మికులంతా ఆందోళన బాట పట్టారు. ఇంత కాలం ఈ పనిని నమ్ముకుని పని చేస్తున్న తాము ఇకపై ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే తమకు భరోసా లభిస్తుందనుకుంటే.. నేడు ఉపాధికే గండం వచ్చిందని వాపోతున్నారు.

స్మార్ట్ మీటర్లు వస్తే ముప్పు



విద్యుత్ స్మార్ట్ మీటర్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తే మా పనికి గండం ఏర్పడుతుంది.గత 30 ఏళ్లుగా ఈ పనినే నమ్ముకుని జీవిస్తున్నాం. జీతాలు పెంచాలని కోరుతున్న సమయంలో ఏకంగా రోడ్డుపై పడే రోజులు వస్తున్నాయి. ప్రభుత్వం మా సమస్యను పట్టించుకుని న్యాయం చేయాలి. – అప్పలకొండ, రీడింగ్ తీసే కార్మికుడు

పాలకులు పట్టించుకోవాలి



మీటర్ల రీడింగ్ తీస్తూ చాలీచాలని జీతాలతో కుటుంబాలను ఈడ్చుతున్నాం. ఇంతలో స్మార్టు మీటర్లు వచ్చాయి. ఇవి ఏర్పాటు చేస్తే ప్రతి నెలా రీడింగ్ తీసే పని ఉండదు.అధికారులు, పాలకులు మా సమస్యపై దృష్టి ఉపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. – రాంబాబు, రీడింగ్ కార్మికుడు

మమ్మల్ని రోడ్డున పడేయకండి



స్మార్టు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తే రీడింగ్ తీసే పని ఉండదు. రీడింగ్ తీసే పని లేకుంటే మా ఉపాధి ప్రశ్నార్థకమే. వేతనం తక్కువే అయినా రీడింగ్ తీసే పనిని నమ్ముకుని ఇంత కాలం పని చేస్తున్నాం.ఇప్పుడు వేరే చోట మాకు ఉపాధి కష్టం.పాలకులు, అధికారులు స్పందించి మమ్మల్ని రోడ్డున పడేయకుండా ఉపాధికి భరోసా కల్పించాలి. – రవికుమార్, మీటర్ రీడింగ్ కార్మికుడు

పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి



మాట్లాడుతున్న అజశర్మ

విశాఖ విద్య: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాత పెన్షన్ స్కీం సాధించేంతవరకు పోరాటం కొనసాగించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అన్నారు. డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెంలో జరిగిన సదస్సులో అజశర్మ ప్రసంగించారు. ప్రభుత్వం ఇప్పుడున్న 14 శాతానికి మరో నాలుగున్నర శాతం కంట్రిబ్యూషన్ పెంచి నిధులన్నీ కార్పొరేట్లకు ఉపయోగపడేటట్టు షేర్ మార్కెట్ లోకి పంపిస్తున్నారని చెప్పారు. ఒకసారి యూపీఎస్ లోకి వెళ్తే మరలా తిరిగి వెనక్కి రాలేమని, ఏప్రిల్ ఒకటిన ఆప్షన్ ఇవ్వకుండా ఓపీఎస్ కోసం పోరాడటమే మంచిదని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఏపీ థామస్, రెడ్డి వెంకటరావు ఆర్‌శ్రీనివాస్, కె. శ్రీనివాసరావు, రక్షణ రంగానికి చెందిన వివిధ యూనియన్ల నాయకులు, కార్మికులు సదస్సులో పాల్గొన్నారు.

అమ్మవారి పండగకు పందిరి రాట



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న కోరాడ శ్రీను

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కోడిపందాలదిబ్బ గ్రామంలో కొలువుదీరిన నూకాలమ్మ పండగకు సంబంధించి ముహూర్తపు రాటను ఆదివారం వేశారు. శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కోరాడ శ్రీను పాల్గొని ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగను అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు,ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

గోపాలపట్నం: ఇంటి నుంచి అలిగి వచ్చేసిన 14 ఏళ్ల బాలుడిని ఆర్‌పీఎఫ్ పోలీసులు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి సమయంలో సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి పెందుర్తి వైపు 14 ఏళ్ల బాలుడు నడుచుకుంటూ వెళ్తున్నాడన్న సమాచారం మేరకు డ్యూటీలో ఉన్న ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ డీఎల్ రావు బాలుడిని పట్టుకున్నారు. రాంబిల్లి మండలం పంచదార్లకు చెందిన నోట్ల భరణి(14)గా గుర్తించారు. తన మామయ్య ఇంటికి వెళ్తున్నానని బాలుడు తెలిపాడు. పోలీసులు బాలుడి మర్రిపాలెం ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి తీసుకు వచ్చి తండ్రికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. రాత్రి సమయంలో తండ్రి రావడంతో అసలు విషయం తెలిసింది. బాగా చదువుకోవాలని ఇంట్లో మందలించడంతో అలిగి వచ్చేశాడని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోయిందని ఇంతలో ఆర్‌పీఎఫ్ పోలీసుల నుంచి ఫోన్ వచ్చిందని తెలిపారు. శనివారం అర్ధరాత్రి సమయంలో తండ్రికి బాలుడు భరణిని అప్పగించారు. దీంతో పోలీసులకు తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్న తిరువీధి సంబరం
అడవివరం ప్రజల వైభోగం



వరాహ పుష్కరిణి వద్ద స్వామి ఊరేగింపులో అడవివరం గ్రామస్తులు

ఏడాదిలో 361 రోజులు సింహగిరిపైనే కొలువుదీరి పూజలు అందుకునే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నాలుగు రోజులు మాత్రం కొండదిగువ అడవివరం గ్రామానికి వేంచేస్తాడు. అది అడవివరం గ్రామస్తులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం. వాతావరణం అనుకూలిస్తే ఆ నాలుగు రోజుల్లో నేరుగా స్వామివారే కొండదిగి అడవివరానికి పండగ శోభ తీసుకొస్తాడు. ఆయా రోజుల్లో గ్రామస్తులు తమ ఇళ్లను ముస్తాబు చేసి, కుటుంబ సభ్యులంతా ముంగిట నిలిచి స్వామివారిని దర్శించుకుని, హారతులిచ్చి సేవిస్తారు.

- ఏటా నాలుగుసార్లు కొండదిగువ కనువిందు చేస్తున్న అప్పన్న
- ఆధ్యాత్మిక పరవశంలో అడవివరం గ్రామస్తులు
- తమ ఇళ్ల ముందుకు వచ్చే స్వామికి విశేష హారతులు



తిరువీధిలో స్వామిని దర్శించుకుంటున్న అడవివరం ప్రజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవాలంటే ఎవరైనా సింహగిరికి వెళ్లాల్సిందే. ఆయన దర్శనానికి దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశీయులు కూడా సింహగిరికి చేరుకోవాల్సిందే. తీరా వెళ్లాక సమయాభావం వల్ల దర్శనం కాకపోతే మళ్లీ దర్శన వేళలు వరకూ వేచి ఉండాల్సిందే. అలాంటిది అడవివరం గ్రామస్తులకు మాత్రం స్వామి వారి ఇళ్ల వద్దకే వేంచేస్తాడు. స్వామి అనుగ్రహం తమపై నిత్యం ఉంటుందనడానికి ఏడాదిలో నాలుగుసార్లు ఆయన కొండదిగి తమ గ్రామానికి రావడమే నిదర్శనమి గ్రామస్తులు మహదానందంగా చెప్పుకుంటారు.

ఆ మూడు వీధుల్లో..

కొండదిగువ నాలుగు పర్వదినాల్లో జరిగే ఉత్సవాల అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్ద ఉన్న ఉద్యానవన మండపం వద్ద ఉంచి, అక్కడి నుంచే తిరువీధి ఉత్సవాలు ప్రారంభిస్తారు. డోలోత్సవం రోజున పల్లకీలోను, తెప్పోత్సవం సర్వజన మనోరంజనిపైన, మకరవేట గజవాహనంపై, జమ్మివేట ఉత్సవాన అశ్వవాహనంపైన స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. గ్రామంలోని పోస్టాఫీసు వీధి, మధ్యవీధి, రాజవీధుల మీదుగా సాగే ఈ ఊరేగింపులో నివాసితులంతా ఇళ్ల నుంచి ముంగిట నిలిచి, స్వామివారి రాకకోసం వేయికళ్లతో ఎదురుచూస్తారు. తమ ఇళ్ల ముందుకు వేంచేసే స్వామికి హారతులిచ్చి, కొబ్బరి, అరటి తదితర పండ్లతో నైవేద్యం సమర్పించి, సాగనంపుతారు. ముఖ్యంగా దేవస్థానంలో విధులు నిర్వర్తించే వైదికులు ఈ మూడు వీధుల్లోనే ఎక్కువగా ఉండటం కూడా తిరువీధి ఉత్సవాలకు మరింత శోభ చేకూరుతోంది.

అప్పన్న కొండ దిగే రోజులు

డోలోత్సవం: ఉద్యానమండపంలో పాల్గుణ పౌర్ణమి రోజున

తెప్పోత్సవం: పుష్య బహుళ అమావాస్య నాడు వరాహ పుష్కరిణిలో

జమ్మివేట: విజయదశమి రోజున స్వామివారి పూలతోటలో

మకరవేట: స్వామివారి పూలతోటలోనే కనుమ రోజు

స్వామిరాకతో నూతనోత్తేజం

ఏటా నాలుగుసార్లు వరాహ లక్ష్మీనృసింహస్వామి సింహగిరి నుంచి మెట్లమార్గంలో కొండ దిగి అడవివరం గ్రామానికి చేరుకుంటాడు. ఆయన రాకకోసం గ్రామస్తులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తారు. చాలా మంది గ్రామస్తులు వేరే గ్రామాల్లో ఉన్న తమ బంధువులకు ఆ రోజుల్లో ఉత్సవాల సమాచారం అందించి, తమ ఇళ్లకు ఆహ్వానిస్తారు. కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి స్వాగతం పలకడం నుంచి ఉత్సవాలు జరిగే పూలతోట, వరాహపుష్కరిణి, ఉద్యానవన మండపంల వద్దకు పెద్ద ఎత్తున కుటుంబాలతో చేరుకుంటారు. స్వామికి జేజేలు పలుకుతూ ఆహ్వానిస్తారు. తమకు మాత్రమే కల్గిన అదృష్టాన్ని కళ్లారా ఆస్వాదిస్తూ, నూతనోత్తేజంతో ఇళ్లకు తిరుగుముఖం పడతారు.



స్వామి రాకకోసం పండ్లు, హారతులతో గ్రామస్తులు

గ్రామస్తులు చేసుకున్న పుణ్యం



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంచేసిన సింహగిరికి ఎంత విశిష్టత ఉందో, కొండదిగువ ఉన్న అడవివరం గ్రామానికి కూడా అంత విశిష్టత ఉంది. అందుకే ఆ స్వామి దివి నుంచి భువికి దిగివచ్చినట్లు.. అడవివరం గ్రామస్తులకు ఆశీస్సులు అందించేందుకు సింహగిరి నుంచి కొండ దిగువకి వస్తాడని అంతా భావిస్తాం. నిజంగా మా అడవివరం గ్రామస్తులు చేసుకున్న పుణ్యం ఇది.

– చిట్టెళ్ల శేషగిరిరావు, రాజవీధి, అడవివరం

ఆద్యంతం రసవత్తరంగా 'భక్త ప్రహ్లాద'



శ్రీహరిపై తన భక్తిని చాటుతున్న భక్త ప్రహ్లాదుడు

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ శ్రీ సాయి కళానికేతన్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం వారు రాష్ట్ర ప్రభుత్వంచే బంగారు నంది బహుమతి పొందిన 'భక్త ప్రహ్లాద' పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఈ నాటకం వీక్షించిన ప్రేక్షకులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. కార్యక్రమ నిర్వహణకు వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ససపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు, పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సహకరించారు. ఈ సందర్భంగా నటులను ఘనంగా సత్కరించారు.

బీసీల అభివృద్ధికి కృషి

సీతమ్మధార: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశంలో గాని రాష్ట్రంలో గాని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎంతో కృషి చేస్తోందన్నారు. బీసీలకు చట్ట సభల్లో ప్రాధాన్యం కల్పించాలని, ప్రత్యేక రాష్ట్రంలో కేంద్ర బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నక్కల్లా నరసింహారావును నియమించినట్లు చెప్పారు. అనంతరం బీసీ సంఘం నాయకులంతా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు నూకాలమ్మ, మల్లేష్, నాగేశ్వరరావు, వేణు, రమణ వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.